సాక్షి బాపట్ల

బుధవారం । 24 । జనవరి । 2024




జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీపీ డి.వి.లలితకుమారి ఆధ్వర్యంలో మహిళలు క్షీరాభిషేకం చేశారు.



నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం

తెనాలిటౌన్: గాంధీచౌక్‌లో ఉన్న నేతాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎ.సంపత్ రాయుడు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.20 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 26,558 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మహిళలకు ఆసరా పథకం ఎంతో మేలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- 30,609 సంఘాలకు రూ.263.17 కోట్లు లబ్ధి
- నమూనా చెక్కు అందజేత

బాపట్ల: మహిళలకు ఆసరా పథకం ఎంతో మేలు చేస్తోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 30609 సంఘాలకు రూ.263.17కోట్లు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎన్నో పథకాలు చేపట్టిందని తెలిపారు. ఆసరా పథకాన్ని నాలుగో విడత అందించటం సంతోషకరమన్నారు. ప్రజా రంజక పాలన మళ్లీ కొనసాగాలని సూచించారు. నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ కృష్ణ, డీపీఎం లక్ష్మణాచారి, మెప్మా పీడీ నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావళి తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జేసీ శ్రీధర్

న్యూస్‌రీల్

గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యసేవలు

డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి



ప్రత్తిపాడు: గ్రామాల్లోనే ప్రజలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు-1 సచివాయలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎంహెచ్‌వో మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. డీఐవో సుబ్బరాజు, వైద్యాధికారులు డాక్టర్ దివ్య మేఘన, డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు. శిబిరానికి 295 మంది రోగులు హాజరయ్యారు. వీరికి వైద్యాధికారులు డాక్టర్ ఏ స్రవంతి, డాక్టర్ వెంకట జయశ్రీ, డాక్టర్ కె ఈశ్వర్, డాక్టర్ అనన్య, డాక్టర్ సాయి రెజ్వానాలు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మాత్రలు అందజేశారు.

పంగులూరులో సామాజిక తనిఖీ

రూ.9.32 కోట్ల పనులకు ఆడిట్
నిర్వహించిన పీడీ అర్జునరావు

జే.పంగులూరు: 2022-23 సంవత్సరానికి రూ. 9.32 కోట్ల పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండల పరిధిలోని పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పీడీ అర్జునరావు ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 15వ మండల స్థాయి ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరుగుతుందని తెలిపారు. ఉపాధి పనికి సంబంధించిన జాబ్‌కార్డులు 11,675 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజినేయులు, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీళ, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, అధికారులు తదిరతులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నరసరావుపేట టౌన్ : పారా లీగల్ వలంటీర్ల నియామాకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తిమంగళవారం తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లు సామాన్య ప్రజలకు, న్యాయ సేవల సంస్థలకు మధ్య అంతరాన్ని పూడ్చేందుకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తారన్నారు. సమాజంలో నిరుపేదలకు సహాయం చేయాలనుకున్నవారితో పాటు అట్టడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఫిబ్రవరి 2వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

వైభవంగా శోభాయాత్ర



నిజాంపట్నం: అయోధ్య మహా నగరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అడవులదీవి గ్రామంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడవులదీవిలోని అభయాంజనేయ స్వామి విగ్రహం నుంచి ప్రధాన రహదారి మీదగా ఎస్టీ కాలనీ వరకు గ్రామంలోని ప్రజలందరూ శోభాయాత్రలో పాల్గొని శ్రీరామ నామనం జపిస్తూ ఆనంద డోలికల్లో మునిగితేలారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిలో కోలాట ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు, జానపద గేయాల ఆలాపనలతో పాటు భారీగా బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి,అమరావతి: ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆ విభాగం డైరెక్టర్ వి.ఆంజనేయులు మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్‌ను అసోసియేసన్ ప్రతినిధులు కలిశారు. కొద్ది కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌ను కోరారు. తమ విజ్ఞప్తుల పట్ల డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణ రావు పేర్కొన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో విజయవాడ, వైజాగ్, రాయలసీమ రీజినల్ కమిటీల అధ్యక్షులు డాక్టర్ విషువర్ధన్, డాక్టర్ సత్యం, డాక్టర్ జయప్రకాశ్‌లు, ప్రతినిధులు ఉన్నారు.



గణతంత్ర దినోత్సవానికి విజయవాడ ముస్తాబవుతోంది. వేడుకలకు వేదికైన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం త్రివర్ణమయమవుతోంది. ప్రాంగణం మొత్తాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జెండా ఆవిష్కరణకు గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రి కూడా హాజరు కానుండటంతో పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గౌరవ వందనంతో పాటు మార్చ్‌ఫాస్ట్ చేసేందుకు అనుగుణంగా స్టేడియాన్ని సిద్ధం చేస్తున్నారు. మంగళవారం పోలీసులు నిర్వహించిన మాక్ డ్రిల్ దృశ్యాలను చిత్రాల్లో చూడొచ్చు.



\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించండి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులపై ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా పలు అంశాలను స్వయంగా వివరించారు. ఎన్నికల ప్రక్రియ, విధివిధానాలు, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, చట్టాలు, నేరాలు, అక్రమ ఆయుధాలు, మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజ్ చేసే ప్రక్రియ, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల సమాచారం సేకరించి అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికాబద్ధంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలకు సందర్శించి, గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. మద్యం, ధనం అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ప్రక్రియ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ విద్యాశ్రీ, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐ రామకృష్ణ, స్పందన సెల్ సీఐ మాలకొండయ్య, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రలోభాలు లేని ఎన్నికల నిర్వహణే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, చిత్రంలో ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల : ఓటర్లను ప్రలోభ పెట్టే పరిస్థితులకు భిన్నంగా రానున్న సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. ఎన్నికల రిటర్నింగ్, నోడల్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే లక్ష్యం అన్నారు. ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థపై నోడల్ అధికారులు అవగాహన పొందాలన్నారు. ముఖ్యంగా మద్యం, నగదు, మాదక ద్రవ్యాలతో ఓటర్లను ప్రేరేపించే పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి కార్యకలాపాలను ముందస్తుగా గుర్తించి నిరోధించే ప్రక్రియలో భాగంగా నిఘా పెంచాలన్నారు. చెక్‌పోస్ట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తం కావాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలని అధికారులకు ఆయన మార్గ నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఈఆర్‌ఓలు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలి

ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని భారత ఎన్నికల కమిషన్ డైరెక్టర్లు సతీష్ పతారియా, పంకజ్‌లు కోరారు. వివిధ రాష్ట్రాలలోని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నోడల్ అధికారులకు కర్ణాటక నుంచి వీక్షణ సమావేశం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సాధారణ ఎన్నికలు ప్రేరేపిత రహితంగా ఉండాలని సతీష్ పతారియా చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ ను భారత ఎన్నికల సంఘం రూపొందించిందన్నారు. వీటి వినియోగింతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించవచ్చన్నారు. గత డిసెంబర్‌లో పలు రాష్ట్రాల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఈ వ్యవస్థను తొలిసారి ప్రయోగించగా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఆ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోనూ ఈ విధానాన్ని అమలుపరిచేందుకు భారతీయ ఎన్నికల సంఘం సిద్ధమైందన్నారు. యాప్ అమలు తీరుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఈఆర్‌ఓలు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు స్వాధీనం

రూ.10.71 లక్షలు పట్టుకున్న జీఆర్పీ పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న జీఆర్పీ పోలీసులు

చీరాల రూరల్: రైలులో అక్రమంగా తరలిస్తున్న నగదును చీరాల జీఆర్పీ పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు, జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్యలు నగదుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో వేటపాలెం మండలం దేశాయిపేటకు చెందిన షేక్ హమీద్ సోమవారం రాత్రి శబరి ఎక్స్‌ప్రెస్‌లో చీరాల రైల్వేస్టేషన్‌లో బ్యాగుతో దిగాడు. సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి హమీద్ బ్యాగును పరిశీలించారు. ఆ బ్యాగులో రూ. 10.71 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన రసీదులను పోలీసులు అడగగా అతడు సరైన పత్రాలు చూపించలేదు. పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదును చీరాల ఆదాయ పన్ను శాఖాధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. హమీద్ చీరాలలో లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వహిస్తున్నాడని అతని స్నేహితుడు గూడూరుకు చెందిన శ్రీహరి కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తుంటాడన్నారు. ఆ క్రమంలో ఈపురుపాలెం, పొన్నూరు ప్రాంతాలలో సప్లై చేసిన కూల్‌డ్రింక్స్ తాలూకు డబ్బులు తీసుకొస్తున్నట్లు హమీద్ తమ విచారణలో చెప్పాడని పోలీసులు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కె.చౌడేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అబ్దుల్ అజీజ్, ఒంగోలు సీఐ ఎస్.శ్రీకాంత్ బాబు ఆదేశాల మేరకు రైళ్లు, రైల్వేస్టేషన్లలో వారం రోజులుగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి రైళ్లలో మద్యం, అక్రమ నగదు, మాదక ద్రవ్యాలు వంటివాటిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైతు జీవితాల్లో సంతోషం చూడాలన్నదే సీఎం లక్ష్యం

- పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి
- 85 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పట్టాలు పంపిణీ



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో రైతుల జీవితాల్లో సంతోషం చూడాలన్నదే సీఎం ముఖ్య కర్తవ్యంగా భావించి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మండలంలోని పోతుకట్ల గ్రామంలో మంగళవారం సాగుభూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమంచి హాజరై అర్హులైన 85 మంది సన్న, చిన్నకారు రైతులకు శాశ్వత సాగు భూమి పట్టాలు పంపిణీ చేశారు. పోతుకట్ల టినాంట్స్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన సుమారు 40 ఎకరాల భూమిని 1920 నుంచి 85 మంది రైతులు డీకే పట్టాలతో సాగు చేసుకుంటున్నారు. భూమికి సంబంధించి వారికి పూర్తి హక్కులు లేకపోవడంతో బ్యాంకులలో వ్యవసాయ రుణాలు పొందలేకపోయారన్నారు. పంట నష్టం జరిగినా రైతుకు పరిహారం, సబ్సిడీ ధరకు ఎరువులు, పురుగుమందులు పొందలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన శాశ్వత భూ హక్కు చట్టం రైతులకు మేలు చేసిందన్నారు. రైతులకు భూమిపై శాశ్వత అన్ని హక్కులు కల్పిస్తూ, వ్యక్తిగత పట్టాలు అందించడంతో తాము భూమికి యజమానులమయ్యామని ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆమంచి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే సంధ్యశ్రీ, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, సర్పంచ్ దాసి ఆనందరావు, నాయకులు ఎర్రం శ్రీహరి, ఎంపీటీసీ రాజేష్, దాసి అనూష, రవీంద్ర, కల్లా వీరారెడ్డి, తెలగతోటి నవీన్, మోచర్ల మనోజ్, నూతలపాటి బలరాం, ముప్పాళ్ల రాఘవయ్య, దాసరి నరసింహారావు, జంగా అనిల్, గాదె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

డీఎంహెచ్‌వో విజయమ్మ



కారంచేడులో జేఏఎస్ మెడికల్ క్యాంపును పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని.. తద్వారా జిల్లాలో ఇంటింటికి వైద్యం అందించే బృహత్తర 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం దిగ్విజయంగా సాగుతోందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. మంగళవారం ఆమె కారంచేడు-3 సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని పరిశీలించారు. సచివాలయ పరిధిలో సుమారు 360 మందికి వైద్య పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కే జెస్సీరాణి డీఎంహెచ్‌వోకు వివరించారు. అక్కడ అందుతున్న సేవలకు ఆమె క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో దశలో అన్ని రకాల వ్యాధులతోపాటు, బీపీ, షుగర్, చర్మవ్యాధులు, సాధారణ వ్యాధులు, మహిళల అనారోగ్య సమస్యల పరీక్షలు, మందుల విభాగం, ప్రభుత్వం ద్వారా తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తలను తీసుకున్నారా లేదా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాల ద్వారా అనుభవజ్ఞులైన వైద్యులచే మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసే ఇలాంటి వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రామనాథం, డాక్టర్ వినయ్‌లు ప్రత్యేక వైద్యులుగా హాజరై వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, పీహెచ్‌ఎన్ సువర్ణజ్యోతి, హెచ్‌వీ వీరమ్మ, హెచ్‌ఎస్ శ్రీనివాసరావు, మోహన్, సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు ఎన్నో లాభాలు

- ఆంధ్రాలో సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగింది
- భారత ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు
- తిమ్మాపురంలో మిరప పంట పరిశీలన



తిమ్మాపురంలో రైతులతో కలసి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యద్దపాడు: రాష్ట్రంలో ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు స్థానికంగానే సలహాలు, సూచనలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించడంతో సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగి లాభాలు పొందుతున్నారని భారత ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవీరెడ్డి చెప్పారు. యద్దపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని మిరప క్షేత్రాలను మంగళవారం బెంగళూరుకు చెందిన భారత ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. ఉద్యాన అధికారులు, రైతులతో కలసి పలు మిరప పంటల్ని పరిశీలించి స్థానిక రైతుల నుంచి వివరాలు సేకరించారు. శాస్త్రవేత్తలు మాధవీరెడ్డి, డాక్టర్ పి నరేష్, డాక్టర్ అచ్చెర్ కొల్లా మాట్లాడుతూ సాగు, మొక్కల పెరుగుదల, పెట్టుబడి, ఆశిస్తున్న తెగుళ్లు, నివారణకు రైతులు అవలంభిస్తున్న చర్యలు, ఉత్పత్తి, దిగుబడి, మార్కెటింగ్ అంశాలపై ఆయా ప్రాంతాల్లో మిరప పంట పరిశీలిస్తున్నట్లు వివరించారు.

మిరప తెగుళ్లపై రైతులకు సూచనలు

స్థానిక రైతులకు శాస్త్రవేత్తల బృందం పలు సలహాలు, సూచనలు చేసింది. మిరప పంటను ఆశించే నల్ల తామర తెగులు నిర్మూలనకు సమగ్ర పురుగు నివారణ యాజమాన్యంతోనే సాధ్యమని ప్రస్తుతం మిరప మొక్కలకు తెల్లదోమ ఆశించడంతో బొబ్బర తెగులు వ్యాపిస్తుందన్నారు. కాబట్టి తెల్లదోమ నివారణతో పంటను పరిరక్షించుకోవచ్చన్నారు. లీటర్ నీటిలో గానుగ నూనెను ఐదు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకుని తెల్లదోమను నివారించుకోవచ్చన్నారు. మిరప మొక్కలకు ఎక్కువగా నల్లతామర సోకుతుందని, నల్లతామర నిర్మూలనకు..పెగాసిస్ 2 గ్రాములు మందును ఒక లీటర్‌లో కలిపి చల్లుకోవాలన్నారు. వీటితోపాటు పసుపు రంగు జిగురు అట్టల్ని ఎకరాకు 40 చొప్పున పొలంలో ఏర్పాటు చేసుకోవా లని సూచించారు. మిరప సాగు రైతులు నాణ్యమైన మిరప నారును ఎంచుకోవడంతోపాటు విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అధిక రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించరాదని తెలిపారు. వీటితోపాటు సమగ్ర పురుగు నివారణ యాజమాన్య విధానం అమలు చేయాలని సూచించారు. ఫలితంగా మిరపను ఆశించే వివిధ తెగుళ్లకు చెక్ పెట్టవచ్చన్నారు. పొలాల్లో నీటి నిల్వ లేకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం

కృతజ్ఞతలు తెలిపిన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

చీరాల:బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల నుంచి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయడంపై నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పార్టీ ముఖ్యనేతలకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు, సహకారం అందించిన పలు శాఖల అధికారులు, సిబ్బందికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తక్కువ వ్యవధిలోనే చీరాలలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించామన్నారు. యాత్రను విజయవంతం చేయడానికి అన్ని విధాలుగా కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు విధాలా సహకారం అందించిన పోలీసు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితోపాటుగా ప్రజలకు ప్రభుత్వం చేసిన, చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపిన సాంఘిక శాఖ మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్‌లకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో చీరాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

శ్రీదేవిపై సస్పెన్షన్ ఎత్తివేత



మేదరమెట్ల: మాజీ ఎమ్మెల్యే, దివంగత జాగర్లమూడి రాఘవరావు కుమార్తె విక్రమ్ శ్రీదేవిపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం తెలిపింది. వైఎస్సార్ సీపీ క్రమ శిక్షణ కమిటీ సిఫార్సు మేరకు పార్టీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు, ఆమెను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన శ్రీదేవి గత సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ విజయానికి కృషి చేశారు. మండలంలో అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీ బలరపరిచిన అభ్యర్థిని గెలిపించుకున్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం:
తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడం ఎంతో ఆనందంగా ఉందని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని విక్రమ్ శ్రీదేవి ఈ సందర్భంగా తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ సమీపంలోని అగ్నిమాపక కేంద్రం గేటువద్ద చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. కాశీ–తమిళ్ సంగమం వీక్లీ ఎక్స్‌ప్రెస్ చీరాల రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరగా.. ఇది గమనించని గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొట్టింది. లోకో పైలెట్ రైలును నిలిపివేసి స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం అందించి, ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి
- గత నెలలో కేజీబీవీలో విద్యార్థిని పాముకాటుకు గురైన ఘటనపై విచారణ


విద్యార్థినులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

నకరికల్లు: బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ 19న స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థిని పాముకాటుకు గురై అస్వస్థతకు లోనైన విషయమై మంగళవారం పాఠశాలకు వచ్చిన బత్తుల పద్మావతి ఘటనపై విచారణ చేపట్టారు. పాముకాటుకు గురైన విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి, ఘటనపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినులకు అపాయం కలిగినా, వారి హక్కులకు భంగం కలిగించినా సహించబోమని అన్నారు. వారు భయభ్రాంతులకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హాజరుశాతం తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి సీఆర్పీ, సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి, మహిళాపోలీస్, మహిళా సమాఖ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తగినచర్యలు తీసుకోవాలని అన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. విద్యార్థులు చిన్నపాటి అనారోగ్యానికి గురైనా ఏఎన్ఎంలు తక్షణమే స్పందించి ప్రాథమిక చికిత్స అందించాలని సూచించారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా, విద్యార్థినుల హక్కులకు భంగం కలిగించినా సహించబోమని అన్నారు. పాఠశాలలో చిన్నచిన్నలోపాలు వారంరోజుల్లో సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత కోసం యాక్షన్‌ప్లాన్ సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నూనె ప్రసాద్, ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ టి.సంతోష్‌కుమారి, సర్పంచ్ పరసా అంజమ్మ పెద్దబ్బాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమీజున్, ఎంపీటీసీ సభ్యులు షేక్.హుస్సేన్‌బీ సలీల్, ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులున్నారు.

రెడ్‌క్రాస్‌లో విద్యార్థులకు అవకాశం ఇవ్వండి

అధ్యక్షుడు, సభ్యులకు సూచించిన జాయింట్ కలెక్టర్


కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెడ్‌క్రాస్ సభ్యులతో మాట్లాడుతున్న జేసీ ఎ.శ్యాంప్రసాద్

నరసరావుపేట: ఇండియన్ రెడ్‌క్రాసు సంస్థలో యువత, విద్యార్థులకు అవకాశం ఇచ్చి సామాజిక సేవ, మొక్కలు నాటడం, రక్తదానం యొక్క ప్రాముఖ్యత, ప్లాస్టిక్ నివారణపై అవగాహన పెంపొందింపజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశాలపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ చైర్మన్, సభ్యులు, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఏర్పాటుచేశారు. జేసీ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవా దృక్పథం కలిగిన సంస్థ అన్నారు. ఆ సంస్థలో కేవలం పెద్దవారే కాకుండా స్కూళ్లు, కళాశాలల్లోని తొమ్మిది నుంచి డిగ్రీ వరకు ఉన్న విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 50వేలమందిని చేర్చుకోవాలన్నారు. డిగ్రీ కళాశాలలకు ఇన్‌చార్జిగా డాక్టర్ సుధాకర్, ఫార్మసీ కళాశాలల ఇన్‌చార్జిగా ఎన్‌పీసీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సురేష్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాలల ఇన్‌చార్జిగా డాక్టర్ శ్రీనివాస్, పాఠశాలలకు ఇన్‌చార్జిగా ఎం.వెంకటరావు నియమించారు. జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు కేఎంఎన్‌వీ శ్రీనివాస గుప్తా, డాక్టర్ రెహమతుల్లా, సింధూ ఎడ్యుకేషనల్ ఎండీ రామకృష్ణ, శంకరభారతీపురం హెచ్ఎం సదానందం వెంకటరెడ్డి, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రతినిధి వెన్నెల పాల్గొన్నారు.

గురజాలకు వస్తే చేసిన అభివృద్ధిని చూపిస్తాం

షర్మిలకు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సవాల్

మాచవరం: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న షర్మిల చేసిన వ్యాఖ్యలను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మాచవరం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై షర్మిల చేసిన చాలెంజ్‌ను స్వీకరిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సైనికుడిగా, ప్రజల పక్షంగా చెబుతున్నానని ఎక్కడైనా, ఎప్పుడైనా సరే పల్నాడు గడ్డ గురజాలకు వస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూపించి, షర్మిలచే శభాష్ అనిపించి, జై జగన్, జై జై జగన్ అనిపించేలా చేస్తామని సవాల్ విసిరారు.

హిమోగ్లోబిన్ పెంపునకు 'బంగారుతల్లి' దోహదం

- ఎక్కడాలేని విధంగా జిల్లాలోనే హిమోగ్లోబిన్ శాతం కార్డులు
- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: జిల్లాలోని 10 ఏళ్ల నుంచి 19 ఏళ్ల మధ్యనున్న బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు బంగారుతల్లి కార్యక్రమం ద్వారా చేస్తున్న కృషి ఫలిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. జిల్లాలో రక్తహీనత శాతాన్ని తొమ్మిది శాతానికి తగ్గించి జిల్లాను ప్రథమస్థానంలో ఉంచటమే లక్ష్యమని వెల్లడించారు. ఈనెల 24న నిర్వహించుకునే వయో బాలికల దినోత్సవం ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బాలికల్లో ఎక్కువగా ఎనీమియా తగ్గించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా కిశోర బాలికల్లో ఎనీమియా శాతం తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు భాగస్వాములై పనిచేస్తున్నారన్నారు. గతేడాది ఆగస్టు నుంచి బాలికల్లో రక్తహీనత శాతం తగ్గించేందుకు, సమాయత్తమై పనిచేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. కిషోర్ బాలికల్లో రక్తశాతం గుర్తించేందుకు ఎక్కడాలేనివిధంగా హిమోగ్లోబిన్ కార్డులను ప్రవేశపెట్టామని, వాటి ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనత శాతాన్ని నమోదు చేయటం జరుగుతుందన్నారు. వాటి వివరాలు సంబంధిత కార్డులపై నమోదుచేసి తల్లిదండ్రులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. పిల్లలకు బెల్లంతో చేసిన పదార్థాలు, ఖర్జూరం, రాగి జావ, చిక్కీలు, ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. జిల్లాలో 1.19 లక్షలమందిని పరీక్షించి 67% రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. రక్తహీనత శాతాన్ని నాలుగు గ్రేడ్లుగా విభజించి తదనుగుణంగా రక్తహీనతను సాధారణస్థాయికి తగ్గించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. బంగారుతల్లి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనుల వల్ల 49.5 శాతానికి రక్తహీనత శాతం తగ్గిందని, సుమారుగా 17.8శాతం వృద్ధి సాధించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు, ఇళ్లల్లో ఉండే ఆడపిల్లలను సైతం ఎనిమియా శాతం తగ్గించడమే లక్ష్యంగా చదువుకు ప్రోగ్రెస్ రికార్డు ఎంత అవసరమో బాలికల్లో రక్తహీనత శాతం గుర్తించడం కోసం రికార్డును తయారుచేసి, 'బంగారు తల్లి' పేరుతో వారి తల్లిదండ్రులకు పంపి, ఆ రికార్డు ప్రకారం నడుచుకునేలా వారిలో మార్పును తీసుకొస్తున్నామని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వడ్డెంగుంటలో 'ఐసీఏఆర్' శాస్త్రవేత్తల పర్యటన


మిరప పంటను పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవిరెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.జె.బెన్నీ ఆధ్వర్యంలో రైతులకు మిరప పంటపై మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన ఐసీఏఆర్ – ఐఐహెచ్ఆర్ (అఖిల భారత ఉద్యాన పరిశోధన స్థానం) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవిరెడ్డి, డాక్టర్ పి.నరేష్, డాక్టర్ అచేర్ కుల్ల శాస్త్రవేత్తల బృందం సభ్యులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం కేంద్రం ద్వారా రైతులకు అందజేసిన మిరప వంగడాలను అర్క తేజస్విని, అర్క యశస్విని, అర్క శాన్వి మొదలైన విత్తనరక పంటలను క్షేత్రస్థాయిలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవిరెడ్డి రైతులకు మిరప పంటలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ పి.నరేష్ మిరప పంటలో పంట మార్పిడి, మిరపలో వచ్చే చీడపీడల యొక్క ప్రాముఖ్యతను, వాటి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. జిల్లా ఉద్యాన అధికారి బి.జె.బెన్నీ మాట్లాడుతూ మిరప పంటను ఆశించే తెగుళ్ల ఉధృతిని అరికట్టేందుకు వివిధ పరిశోధనల కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు జిల్లాలో పర్యటించి వారి సలహాలు అందజేస్తున్నట్లు వివరించారు. వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట ఉద్యానశాఖ అధికారులు షేక్ నబీ రసూల్, ఎస్.సురేష్, ఎస్.కిషోర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

డ్రైవరుకు గుండెపోటు అదుపుతప్పిన లారీ

- రోడ్డు రోలర్‌తో సహా కాలువలో బోల్తా
- ప్రాణాపాయం నుంచి బయటపడ్డ డ్రైవర్


కాలువలో బోల్తా పడిన లారీ, రోడ్డు రోలర్లు

మంచాల (చేబ్రోలు): రోడ్డు రోలర్‌ను గుంటూరు తీసుకు వస్తున్న లారీ డ్రైవరకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో లారీ అదుపుతప్పి కాలువలో బోల్తా పడిన ఘటన మంచాలలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. గుంటూరుకి చెందిన అడపాల గోపాలకృష్ణ హెవీ లారీలో రోడ్డు రోలర్‌ను తీసుకొని గుంటూరు వైపు వస్తున్నాడు. అయితే మార్గ మధ్యలో మండల పరిధిలోని మంచాల గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు వచ్చే సమయానికి డ్రైవర్ గోపాలకృష్ణకు స్వల్పంగా గుండెపోటు రావడంతో సీర్టింగ్‌పై వాలిపోయాడు. దీంతో లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న పొన్నూరు చానల్‌లో బోల్తా పడింది. ఈ సంఘటనలో కాలువ నీటిలోపడి డ్రైవర్ ఉక్కిరి బిక్కిరయ్యాడు. ముఖానికి, తలకు గాయాలైన లారీ డ్రైవర్ గోపాలకృష్ణను పొన్నూరు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో గుంటూరు, పొన్నూరుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. కాలువలో పడిన వెంటనే స్థానికులు స్పందించి డ్రైవర్‌ను అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించటంతో ప్రాణాపాయం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో సిటీకేబుల్ న్యూస్ రీడర్ మృతి


అశోక్

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని సిటీకేబుల్ న్యూస్‌రీడర్ మృతిచెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్‌పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం దాసరిపాలెం ప్లాట్లలో నివాసం ఉండే బత్తిని అశోక్ (26) ఇటీవల పీజీ పూర్తి చేసి, నగరంలోని సిటికేబుల్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతున్నాడు. అంకిరెడ్డిపాలెం గ్రామ శివారులో వినాయకుడి గుడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాలం తీరిందని 'చెక్' పెట్టారు!


పాత చెక్కు బుక్కులను దహనం చేస్తున్న రాజగోపాల్

గుంటూరు వెస్ట్: కాలం చెల్లిన చెక్ పుస్తకాలను అధికారులు దగ్ధం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా ట్రెజరీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో డీటీఓ బి.రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011–12 సంవత్సర కాలంలో జనరల్ ఫండ్‌కు సంబంధించిన 5,889 చెక్కు బుక్కులను ఉన్నతాధికారుల సూచనలతో దగ్ధం చేశామన్నారు. దుగ్గిరాల, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, గుంటూరు తాలూకా, జిల్లా ట్రెజరీ కార్యాలయాలో పేరుకుపోయిన ఈ చెక్కులు ప్రస్తుతం మనుగడలో లేవన్నారు. దీంతోనే వీటిని దగ్ధం చేశామని వివరించారు.

లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయండి
రాజగోపాల్ మాట్లాడుతూ పెన్షన్‌కు సంబంధించి జీవన్ ప్రమాణ్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. లేదా సమీపంలోని ట్రెజరీ కార్యాలయాల్లో కాపీని అందజేయాలని సూచించారు.

హెచ్‌డీ పత్తి సాగుపై దృష్టి పెట్టండి



ప్రత్తిపాడు: హెచ్‌డీ పత్తి సాగుపై రైతులు దృష్టి సారించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ డీడీఏ రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో మంగళవారం గ్రామ విత్తన పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద మండలంలోని గొట్టిపాడు, వంగిపురం రైతులకు ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రైతులకు ప్యూరిటీ విత్తనాలను అందజేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులకు శిక్షణనిచ్చారు. పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులు, అవలంభించాల్సిన విధానాలపై రైతులకు వివరించారు. రైతులు హెచ్‌డీ కాటన్ సాగుపై ఆలోచించాలన్నారు. ఈ రకం సాగు వలన రెండు తీతల్లోనే దిగుబడి చేతికి వస్తుందని, మామూలు రకాల వలన మూడు పత్తి తీతలు పడుతున్నాయని, దీని వలన ప్రకృతి విపత్తుల సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఏఓ రాజవంశి, ఏరువాక శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏఓ అరుణకుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అర్హులకు అందజేయాలి

- వికసిత్ భారత్ ఏపీ నోడల్ ఆఫీసర్ మొనాలీసా దేష్
- రెండు గ్రామాల్లో సంకల్పయాత్ర


వికసిత్ భారత్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న మొనాలీసా దేష్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీపీఓ

నకరికల్లు: కేంద్రప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా చూడడం, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడడం అధికారులు బాధ్యతగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ ఆఫ్ పోలీస్, ఏపీ నోడల్ ఆఫీసర్ మొనాలీసా దేష్ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల, గుండ్లపల్లి గ్రామాల్లో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ శాఖలవారీగా కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ మహిళా అభ్యుదయం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ తరపున ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని పరిశీలించారు. తొలుత వికసిత్ భారత్ పోస్టర్‌లను విడుదల చేశారు. డ్వామా పీడీ బి.బాలూనాయక్, డీపీఓ ఎంవీ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మి నాగేశ్వరరావు, డాక్టర్ మణికంఠ, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏఓ కె.దేవదాసు, ఏపీఓ రామకృష్ణ, ఎంఈటీసీ సభ్యులు కోటిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

బాల కార్మిక రహిత సమాజమే లక్ష్యం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



మాట్లాడుతున్న కార్యదర్శి లీలావతి

గుంటూరు ఎడ్యుకేషన్: బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు వెళ్లాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం కార్మికశాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్తంగా బాల కార్మిక నిషేధ చట్టానికి సంబంధించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం (ఎస్ఓపీ)పై ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లీలావతి మాట్లాడుతూ ఆపరేషన్ స్వేచ్ఛ 2023–24 మొదటి దశలో ఉమ్మడి గుంటూరు టాస్క్‌ఫోర్స్ ప్రభావంతంగా పని చేసిందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు మరింత సమన్వయంతో ముందుకు వెళ్లడం ద్వారా గుంటూరు జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా మొదటి స్థానంలో నిలపవచ్చునన్నారు. కార్మికశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ అఖిల్ బాల కార్మికులను గుర్తించిన తరువాత చట్ట పరిధిలో సంబంధిత బాలల హక్కులను పరిరక్షించడంతో పాటు కేసుల నమోదు, నష్ట పరిహారాన్ని రాబట్టి, బాలల విద్య, అభివృద్ధికి ప్రభుత్వ శాఖలు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఆరోగ్య ప్రమీల, బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త తిరుపతి రావు, జిల్లా బాలల రక్షణాధికారి విజయ్‌కుమార్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ రాష్ట్ర ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ తంబి, జిల్లా ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ కన్వీనర్ డి. రోషన్ కుమార్, క్రాఫ్ జిల్లా సమన్వయకర్త కోలా సమీర్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్మిక, మానవ అక్రమ రవాణా నిర్మూలన దళ, పోలీస్, సాంఘిక సంక్షేమ, విద్యాశాఖాధికారులతో పాటు, పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి 'రెజ్లింగ్'కు ఎస్‌కేఆర్‌బీఆర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్‌వీ నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21తేదీల్లో కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో రెండు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు వై.శ్యాంసన్(55కేజీల), ఎం.మహేష్ 67(కేజీలు) బంగారు పతకాలు, ఎం.దయాకర్ కాంస్య పతకాలు సాధించి ఈ నెల 29, 30 తేదీల్లో మహారాష్ట్రలోని పూణెలో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్, అధ్యాపకులు అభినందించారు.

గుంటూరు రేంజ్‌లో నలుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. తుళ్ళూరు పీఎస్–1 సీఐ ఎం.అనందరావు, తుళ్ళూరు పీఎస్–2 ఎం.శేషగిరి, తుళ్ళూరు ట్రాఫిక్–1 సీఐ ఆర్.సురేష్, గుంటూరు ఎస్‌బీ–1 సీఐ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఈ మేరకు ఆ నలుగురిని రేంజ్ వీఆర్ గుంటూరుకు బదిలీ చేశారు.